సాక్షి కామారెడ్డి

సోమవారం । 23 । అక్టోబర్ । 2023



వైభవంగా శరన్నవరాత్రులు

జిల్లాలో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

- IIలో ▸



కేసీఆర్‌ను గెలిపించుకుందాం

కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుందామని బీఆర్ఎస్ నాయకుడు వేణుగోపాల్‌రావు అన్నారు.

- IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.3/20.1

వాతావరణం

ఆకాశం ఉదయం నిర్మలంగా ఉంటుంది. ఎండతీవ్రత ఉండవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం చల్లటిగాలులు వీస్తాయి. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు దసరా

సాక్షి,కామారెడ్డి: జిల్లావ్యాప్తంగా సోమవారం దసరా వేడుకలను నిర్వహించనున్నారు. ఈ రోజు శమి, ఆయుధ, వాహన పూజలు చేస్తారు. భక్తులు ఆలయాల్లో పూజలు చేస్తారు. ఈ మేరకు ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు.

ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు



సుభాష్‌నగర్ : విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలకు రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి దసరా ప్రతీక అని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి అందరూ విజయదశమి పండుగను ఆనందంగా జరుపుకోవాలని పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు.

చెడుపై విజయానికి ప్రతీక విజయదశమి

కామారెడ్డి క్రైం: చెడుపై సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. దసరా పండుగను జిల్లా ప్రజలు కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని ఆదివారం ఆయన ఒక ప్రకటన ద్వారా ఆకాంక్షించారు.

దైవభక్తి పెంపొందించుకోవాలి



బిచ్కుంద/మద్నూర్: బిచ్కుందలోని టీచర్స్ కాలనీలో కొలువుదీరిన దుర్గామాతను ఆదివారం జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే దర్శించుకొని పూజలు చేశారు. ప్రతి ఒక్కరు దైవభక్తి పెంపొందించుకొని మంచి మార్గంలో నడవాలని ఎంపీ కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రార్థన మందిరాల అభివృద్ధికి ఎన్నో నిధులు కేటాయించిందన్నారు. ఎంపీపీ అశోక్, ఉప సర్పంచ్ నాగరాజ్, వెంకట్‌రావు, అసద్‌అలీ పాల్గొన్నారు. మద్నూర్‌లోని ఇంద్రనగర్‌లోని ఎంపీ బీబీ పాటిల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గెలిచినా ఓడినా ప్రజా సేవలోనే..



దోమకొండ: తాను ఎన్నికల్లో గెలిచినా.. ఓడినా ప్రజాసేవలో ఉంటానని బీజేపీ కామారెడ్డి అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చింతమాన్‌పల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తనకు రాజకీయాల కంటే ప్రజా సేవే ముఖ్యమన్నారు. ప్రజలు ఈ సారి ఆలోచించి ఓటు వేయాలని కోరారు. బీజేపీ మండలాధ్యక్షుడు చింతల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సద్దుల సంబురం



ఊరూవాడా బతుకమ్మ పాటలతో మార్మోగాయి. గ్రామాల్లోని కూడళ్లు పూలవనాలను తలపించాయి. ఆదివారం జిల్లావ్యాప్తంగా సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో భక్తి శ్రద్ధలతో బతుకమ్మలను పేర్చారు. బతుకమ్మల చుట్టూ ఆడి పాడారు. మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరై సందడి చేశారు. అనంతరం గంగమ్మ ఒడికి బతుకమ్మలను చేర్చారు. ఒకరికొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకొని వెంట తెచ్చుకున్న సద్దులను ఆరగించారు.

– సాక్షి, నెట్‌వర్క్



నాగిరెడ్డిపేట మండలం జప్తిజాన్కంపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మాచారెడ్డి మండలం గన్‌పూర్(ఎం) గ్రామంలో..



నిజాంసాగర్ మండలం మాగిలో..



కామారెడ్డిలోని వీక్లీమార్కెట్‌లో..

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి



హజ్గుల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధే

- ఎమ్మెల్యే హన్మంత్ సింధే

బిచ్కుంద(జుక్కల్): నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేసి ఆశీర్వదించాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. ఆదివారం పెద్దదేవాడ, హజ్గుల్, మెక్కా, తక్కడ్‌పల్లి గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. కార్యకర్తలు, మహిళలు తిలకం దిద్ది, హారతి ఇచ్చి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం చేసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు.. వీటిని కొనసాగించడం కాంగ్రెస్, బీజేపీతో కాదన్నారు.

మహారాష్ట్ర, కర్ణాటకలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వం ఉంది.. ఆ రాష్ట్రాలలో దళితబంధు, రైతు బీమా, పంట పెట్టుబడి, అర్హులందరికి పింఛన్లు ఎందుకు లేవని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు కల్లబొల్లి మాటలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తారు నమ్మవద్దని ఓటర్లను కోరారు. ఎంపీపీ అశోక్, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, నాయకులు నాల్చర్‌రాజు, వెంకట్‌రావు దేశాయి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

వీడని ఉత్కంఠ!

- కొలిక్కిరాని కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక
- జిల్లాలో నాలుగూ పెండింగులోనే..
- నైరాశ్యంలో పార్టీ శ్రేణులు



సాక్షి, కామారెడ్డి: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులపై అదే ఉత్కంఠ కొనసాగుతోంది. ఢిల్లీలో ఆదివారం జరిగిన కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో కొలిక్కి వస్తుందని అందరూ భావించారు. సమావేశం అనంతరం మరో రెండు మూడు రోజులు ఆగాల్సిందేనని తేల్చారు. దీంతో ఆశావహుల్లో నైరాశ్యం అలుముకుంది. జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఇప్పటికీ ఒక్కటీ తేల్చలేదు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. కామారెడ్డి నుంచి టికెట్ రేసులో మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఒక్కరే ఉన్నారు. ఆయనకు ఎలాంటి ఆటంకాలు లేకపోవడంతో తొలి జాబితాలోనే పేరు ఉంటుందని భావించారు. అయితే తొలి జాబితాలో కామారెడ్డి అభ్యర్థి పేరు లేకపోవడంతో షబ్బీర్ అలీ అనుచరులు ఖంగుతిన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థిగా సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండడంతో షబ్బీర్ అలీ పోటీపై పుకార్లు వినిపించాయి. ఎల్లారెడ్డి టికెట్ కోసం మదన్‌మోహన్‌రావు, సుభాష్‌రెడ్డి తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఇద్దరిదీ తెగని పంచాయతీ. ఇద్దరూ టికెట్ తనకే వస్తుందంటే తనకే వస్తుందన్న ధీమాతో ఉన్నారు. ఎవరి ప్రయత్నాలు వాళ్లు చేస్తున్నారు. ఢిల్లీలో మకాం వేసి టికెట్ సాధించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. బాన్సువాడ పరిస్థితి కూడా గందరగోళంగా ఉంది. ఇక్కడ కాసుల బాల్‌రాజు, జ్యోతిర్మయరెడ్డితో పాటు మరో పది పన్నెండు మంది టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడికి వేరే నియోజకవర్గం నేతలను పంపుతారని ప్రచారం జరగడంతో స్థానికులకే టికెట్ ఇవ్వాలంటూ స్థానిక నేతలు డిమాండ్ చేస్తున్నారు. జుక్కల్‌లో మాజీ ఎమ్మెల్యే గంగారాం, లక్ష్మీకాంతారావు మధ్య టికెట్ ఫైట్ నడుస్తోంది.

ఇంకో రెండు, మూడు రోజులు

కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక కోసం పార్టీ జాతీయ నాయకత్వం కసరత్తు చేసినా కొలిక్కి రాలేదు. మరో రెండు మూడు రోజులు ఆగాల్సిందేనన్న సంకేతాలు ఇచ్చారు. దీంతో ఆశావహుల్లో మరింత ఆందోళన పెరిగింది. కొందరు నేతలు ఢిల్లీలోనే మకాం వేశారు. ఆదివారం ఏదో ఒకటి తేలుతుందని ఆశించారు. సమావేశం జరిగినా కొలిక్కిరాకపోవడతో నిరాశకు గురయ్యారు. దసరా పండుగ ఉండడంతో కొందరు తిరుగు ప్రయాణమయ్యారు. రెండు మూడు రోజుల తర్వాత మళ్లీ కేంద్ర నాయకత్వం సమావేశమై అభ్యర్థులను ఖరారు చేస్తుందని భావిస్తున్నారు. అభ్యర్థులు ఖరారు కాకపోవడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నైరాశ్యం అలుముకుంది. కామారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఊళ్లల్లో తిరిగి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఎల్లారెడ్డిలో రెండు వర్గాలు కూడా టికెట్ ఎవరికి ఇస్తారోనన్నదానిపై ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రచారం అంతంతమాత్రంగానే నడుస్తోంది. జుక్కల్‌లో మాజీ ఎమ్మెల్యే గంగారాం పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. జనంలో తిరుగుతున్నారు. బాన్సువడలో అక్కడక్కడా కొంత ప్రచారం నడుస్తోంది. అభ్యర్థుల ప్రకటన వెలుబడిన తర్వాతే ప్రచారం ఊపందుకునే అవకాశం ఉంది.

కేటీఆర్ కనుసన్నల్లో..

- ఇప్పటికే సమన్వయ కమిటీ ఏర్పాటు
- బూత్ కమిటీలకు ప్రచార బాధ్యతలు
- పండుగ తర్వాత కామారెడ్డికి కేసీఆర్, కేటీఆర్


సాక్షి, కామారెడ్డి: సీఎం కేసీఆర్ పోటీ చేయనున్న కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మంత్రి కేటీఆర్ పార్టీ నేతలు, శ్రేణులను సమన్వయం చేస్తున్నారు. నియోజకవర్గ కేంద్రంలో ఈనెల 7న బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి హాజరైన కేటీఆర్ ఒక్కో బూత్‌లో పది మందితో కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని, ఎన్నికలు అయ్యే వరకు బూత్ కమిటీ ప్రతినిధులంతా స్థానికంగా ఉండి ఓటర్లకు ప్రభుత్వం అందించిన పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించాలని సూచించారు. బూత్ కమిటీల ఏర్పాటుపై పార్టీ ఇన్‌చార్జీలు గంప గోవర్ధన్, శేరి సుభాష్‌రెడ్డితో సమీక్షించిన కేటీఆర్ ముఖ్య నేతలందరినీ ప్రగతి భవన్‌కు రప్పించారు. నాయకుల మధ్య నెలకొన్న విభేదాలు, ఆధిపత్య పోరుపై సమీక్షించారు. కొందరికి వార్నింగులు ఇచ్చారు. పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందని, నష్టం చేసేవారిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే నియోజకవర్గంలో పార్టీ నేతలను సమన్వయ పరిచి, ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కో ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేశారు. మంత్రి కేటీఆర్‌తో పాటు విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, కొమ్ముల తిర్మల్‌రెడ్డి, నిట్టు వేణుగోపాల్‌రావ్, ఎల్ నర్సింగరావ్, పున్న రాజేశ్వర్‌తో కమిటీని ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు కేటీఆర్ దిశానిర్దేశం చేస్తున్నారు.

చేరికలపై ఫోకస్

కామారెడ్డి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులంతా అధికార పార్టీకి చెందినవారే ఉన్నారు. బలమైన క్యాడర్ కూడా ఉంది. అయినా ఆ పార్టీ నాయకత్వం చేరికలపై ఫోకస్ చేస్తోంది. మంత్రి కేటీఆర్ నిర్దేశించిన విధంగా కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నేతలను తమవైపు లాక్కునేందుకు ఎక్కడికక్కడ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. షెడ్యూల్‌కు ముందే కామారెడ్డి మున్సిపల్‌లో బీజేపీ కౌన్సిలర్ ఒకరికి గులాబీ కండువా కప్పారు. ఇప్పుడు గ్రామాల్లో మండల, గ్రామ స్థాయి నేతలపై దృష్టి సారించారు. ప్రత్యర్థి పార్టీలను బలహీనపర్చడం ద్వారా పైచేయి సాధించాలని బీఆర్ఎస్ భావిస్తోంది.

మండలాల నేతలతో సమావేశం

నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన పార్టీ నేతలతో సమావేశమయ్యేందుకు మంత్రి కేటీఆర్ రానున్నారు. దసరా తర్వాత రెండు రోజుల పాటు సమావేశాలు నిర్వహిస్తారు. భిక్కనూరు,



రాజంపేట, దోమకొండ, బీబీపేట మండలాల నాయకులతో ఒక రోజు, మాచారెడ్డి, పాల్వంచ, కామారెడ్డి పట్టణం, కామారెడ్డి, రామారెడ్డి మండలాల నేతలతో మరో రోజు సమావేశం కానున్నారు.

క్యాడర్‌తో సమావేశానికి కేసీఆర్

సీఎం కేసీఆర్ కూడా నియోజకవర్గ పార్టీ శ్రేణులతో సమావేశం కానున్నారు. కామారెడ్డి సమీపంలో ఎక్కడైనా అనుకూల స్థలంలో సమావేశానికి ప్లాన్ చేస్తున్నారు. సుమారు ఏడు వేల నుంచి ఎనిమిది వేల మంది కార్యకర్తలు, నాయకులతో ఆయన సమావేశం కానున్నట్లు సమాచారం. ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించేందుకు ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. నవంబర్ 9న నామినేషన్ వేసి ఆ రోజు భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అంతకు ముందే క్యాడర్‌తో సమావేశం అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు.

దూకుడు పెంచనున్న కమలదళం!

- బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా విడుదల
- కామారెడ్డిలో కాటిపల్లి, జుక్కల్‌లో అరుణతార
- రెండో విడతలో బాన్సువాడ, ఎల్లారెడ్డి!

సాక్షి, కామారెడ్డి: భారతీయ జనతా పార్టీ తొలి విడతలో జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించడంతో శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది. దసరా తర్వాత ప్రచారంలో దూకుడు పెంచుతామని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంపై బీజేపీ జాతీయ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇక్కడ బీజేపీ అభ్యర్థిగా జెడ్పీ మాజీ చైర్మన్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి పేరును ప్రకటించింది. ఆయన చాలా కాలంగా నియోజకవర్గంలో విస్తృతంగా తిరుగుతున్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించారు. టికెట్ ప్రకటన వెలువడడంతో ప్రచారాన్ని ఉధృతం చేయనున్నారు. ఇక్కడ సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న నేపథ్యంలో గట్టిగా ఢీకొట్టాలని ఆ పార్టీ నేతలు సమాలోచనలు జరిపారు. రాష్ట్ర స్థాయి నేతలతో పాటు జాతీయ స్థాయి నాయకులతో కామారెడ్డిలో బహిరంగ సభలకు ప్లాన్ చేస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని బూత్‌ల పరిధిలో బూత్ కమిటీలను ఏర్పాటు చేసిన బీజేపీ నాయకత్వం అధికార పార్టీ నుంచి ఎదురయ్యే ఒత్తిడిని తట్టుకునేందుకు గట్టి ప్రయత్నం చేస్తుందని భావిస్తున్నారు. జుక్కల్ నియోజక వర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతారకు టికెట్ ఖరారు చేశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పరిచయాలు ఉండడంతో ఆమె ఒక పర్యాయం ఊళ్లన్నీ చుట్టేశారు. పండగ తర్వాత ప్రచారాన్ని ముమ్మరం చేస్తారని తెలుస్తోంది.

పెండింగ్‌లో బాన్సువాడ, ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి ఎవరిని బరిలోకి దింపుతారన్న దానిపై క్లారిటీ రావడం లేదు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి బీజేపీలో చేరిన తర్వాత ఆయనే అభ్యర్థి అవుతారని అందరూ అనుకున్నారు. అయితే కొంతకాలంగా ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. కాంగ్రెస్ నేతలతో సంప్రదింపులు కూడా జరిపారన్న ప్రచారం జరిగింది. అయితే కాంగ్రెస్‌లో టికెట్ కోసం తీవ్ర పోటీ ఉండడంతో ఆయనకు అక్కడ సరైన అవకాశం దొరకలేదు. దీంతో బీజేపీలోనే కొనసాగుతారా అన్నదానిపై స్పష్టత కరువైంది. తన సతీమణి మంజులారెడ్డిని ఎన్నికల బరిలో దింపాలని భావించారు. అయితే బీజేపీ నాయకత్వం రవీందర్‌రెడ్డికి గానీ, ఆయన సతీమణి మంజులరెడ్డికి గానీ టికెట్ ఇస్తుందా లేదా అన్నదానిపై స్పష్టత రావడం లేదు. ఇక్కడ నుంచి గతంలో పోటీ చేసిన బాణాల లక్ష్మారెడ్డి ఇటీవల యాక్టివ్ అయ్యారు. ఆయన కూడా టికెట్ రేసులో ఉన్నట్టు తెలుస్తోంది. పైలా కృష్ణారెడ్డితో పోటు బైండ్ల పోచన్న అనే యువ నాయకుడు కూడా టికెట్ అడుగుతున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో మల్యాద్రిరెడ్డి పోటీ చేస్తారని భావిస్తున్నారు. ఆయనతో పాటు మరికొందరు టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. మొదటి జాబితాలో బాన్సువాడ పేరు ప్రకటించలేదు. రెండో విడతలో ప్రకటించే అవకాశం ఉంది.

భారీ సభలకు ప్లాన్

బీజేపీ నాయకత్వం ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేయడంలో భాగంగా భారీ బహిరంగ సభలకు ప్లాన్ చేస్తోంది. జిల్లా కేంద్రమైన కామారెడ్డిలో జాతీయ స్థాయి నేతలతో సభలు నిర్వహించనున్నారు. దసరా పండుగ తర్వాత సభలపై క్లారిటీ వస్తుందని భావిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ నాయకులు పాల్గొనేలా సభలకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోనూ భారీ సభలు నిర్వహించే అవకాశాలున్నాయి.

రావణ దహనం ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ: పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో సోమవారం రాత్రి నిర్వహించే రావణ దహనం ఏర్పాట్లను ఆదివారం డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్‌తో కలిసి పరిశీలించారు. కొన్ని సంవత్సరాలుగా ప్రతి ఏటా దసరా పండుగ సందర్భంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని వారు అన్నారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సొంత నిధులతో ఉచిత విద్యావైద్యం



బీజేపీలో చేరిన కాచాపూర్ గ్రామస్తులు



భవానీపేట గ్రామస్తులు

- కామారెడ్డి బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి

భిక్కనూరు/మాచారెడ్డి: నియోజకవర్గంలో సొంత నిధులతో ప్రజలకు అవసరమైన అభివృద్ధి చేపడతానని బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం భిక్కనూరు మండలం కాచాపూర్, పాల్వంచ మండలం భవానీపేట గ్రామాలకు చెందిన పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. వీరికి ఆయన బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి మండలంలో ఉచిత వైద్యం అందించేందుకు తన సొంత నిధులతో ఉచిత వైద్యశాల, ఉచిత విద్య అందించేందుకు ఉచిత మోడల్ స్కూల్‌ను, ఉపాధి శిక్షణ కేంద్రం, యువత క్రీడా శిక్షణ కేంద్రం, రైతు సేవా కేంద్రం, రైతుల కోసం సీసీ కల్లాలను ఏర్పాటు చేస్తానన్నారు.

సొంత మేనిఫెస్టో ప్రతుల పంపిణీ

భిక్కనూరు: అంతంపల్లిలో సొంత ఎన్నికల మేనిఫెస్టో ప్రతులను ఆదివారం వెంకటరమణారెడ్డి పంపిణీ చేశారు. బీజేపీ నేతలు అలకొండ రవీందర్‌రెడ్డి, గోల్కొండ శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రాములు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల సంబురాలు



జిల్లా కేంద్రంలో బాణసంచా కాలుస్తూ..

భిక్కనూరు/కామారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా కాటిపల్లి వెంకటరమణారెడ్డిని పార్టీ అధిష్టానం ప్రకటించడంతో భిక్కనూరుతో పాటు జిల్లా కేంద్రంలో ఆ పార్టీ నేతలు ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు.



తాడ్వాయిలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



దేవునిపల్లిలో పూజలు చేస్తున్న మాలధారులు

వైభవంగా శరన్నవరాత్రులు

సాక్షి నెట్‌వర్క్: దేవి శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. ఎనిమిదో రోజైన ఆదివారం అమ్మవారి మండపాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, హోమం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కామారెడ్డిలోని శ్రీశారదా ఆదిశంకర ఆలయంలో వేదపండితులు చండీహోమం, మూలమంత్ర హోమం, బలిప్రదాన మహాపూర్ణాహుతి నిర్వహించారు. సోమవారం అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిస్తారని, నవరాత్రి ఉత్సవాలు ముగుస్తాయని వేద పండితులు తెలిపారు.



సదాశివనగర్‌లో భజనలు చేస్తున్న భక్తులు



మహమ్మద్‌నగర్‌లో పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



నాచుపల్లిలో..



కామారెడ్డి: శారదామాత ఆలయంలో చండీహోమం

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

నాగిరెడ్డిపేట: కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన ఓ మహిళ ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెందిన ఘటన మండలంలోని చీనూర్ శివారులో ఉన్న కొమిరెడ్డికుంటలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోపాల్‌పేటకు చెందిన కొప్పోలు అలియాస్ అంజమ్మ(58)ఈ నెల20న ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామసమీపంలోని కొమిరెడ్డికుంటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఆమె కోసం పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుంటలో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై అంజమ్మ మృతదేహంగా గుర్తించారు. మృతురాలి సోదరి పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రాక్టర్ కిందపడి రైతు..

నాగిరెడ్డిపేట: మండలంలోని బెజుగం చెరువుతండాకు చెందిన అంగోత్ పీర్యా(45) ట్రాక్టర్ చక్రాల కిందపడి మృతి చెందిన ఘటన శనివారంరాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పీర్యా తన సమీప బంధువు విఠల్‌తో కలిసి శనివారంరాత్రి తన ట్రాక్టర్‌పై ఎల్లారెడ్డి నుంచి బెజుగంచెరువుతండాకు వెళ్తుండగా తండాలోని సేవాలాల్ గుడివద్దకు రాగానే అడవిపంది అడ్డుగా వచ్చింది. దానిని తప్పించే క్రమంలో ట్రాక్టర్ బండరాయిని ఢీకొన్నది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న పీర్యా పైకి ఎగిరి కిందపడడంతో ట్రాక్టర్ చక్రాలు అతని తల, ఛాతిపై నుంచి వెళ్లడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



పీర్యా(ఫైల్)

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ట్రాక్టర్‌పై నుంచి కిందపడి మృతిచెందిన పీర్యా కుటుంబాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదివారం పరామర్శించారు. ప్రమాదం జరిగినతీరును తండావాసులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిద్ధయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

చెరువులో పడి ఒకరు..

పెద్దకొడప్‌గల్: జీవితంపై విరక్తితో ఒకరు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై కోనారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గైని లక్ష్మణ్(28) ఎనిమిది సంవత్సరాల క్రితం కల్హేరు మండలం కిష్టాపూర్‌కు ఇల్లరికం వెళ్లాడు. అతని భార్య తరచూ గొడవ పడుతుండడంతో మూడేళ్ల క్రితం పెద్దకొడప్‌గల్‌కు వచ్చి తల్లి గైని రామవ్వ వద్ద ఉంటున్నాడు. భార్యకు దూరంగా ఉంటున్నందున జీవితంపై విరక్తితో శనివారం ఇంటి నుంచి వెళ్లిన లక్ష్మణ్ తిరిగి రాలేదు. చెరువులో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టగా లక్ష్మణ్ మృతదేహంగా గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



లక్ష్మణ్ (ఫైల్)

తనిఖీల్లో నగదు పట్టివేత

ఎల్లారెడ్డి/ బోధన్ రూరల్: ఎల్లారెడ్డి మండల శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా కారులో ఒకరి నుంచి రూ. 1,47,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల ఫ్లయింగ్ టీం అధికారులు ఆదివారం తెలిపారు. ఈ నగదును కలెక్టర్ కార్యాలయానికి అందించినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీనివాస్, సత్తయ్య తెలిపారు. సాలూర, బోధన్ మండలాల్లో బోధన్ రూరల్ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. సాలూర చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేస్తుండగా మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి కారులో వస్తున్న హన్మంత్ నుంచి రూ.1,11,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. సరైన ఆధారాలు చూయించకపోవడంతో నగదు సీజ్ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.



ఎల్లారెడ్డిలో పట్టుకున్న నగదుతో అధికారులు

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

డిచ్‌పల్లి: అనారోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులతో ఒకరు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మెంట్రాజ్‌పల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన దీపక్ (36) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. దీనికి తోడు చేసిన అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి గ్రామ శివారులోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.ఉదయం మృతదేహం ఉందన్న సమాచారం మేరకు ఎస్సై ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టగా దీపక్ మృతదేహంగా గుర్తించారు.మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



దీపక్ (ఫైల్)

విద్యుదాఘాతంతో గేదె మృతి



తాడ్వాయి: సంతాయిపేట్ గ్రామంలో సిద్ధిరాములుకు చెందిన పాడిగేదె కొట్టంలో విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. గేదె విలువ రూ. 50వేల వరకు ఉంటుందన్నారు. ప్రభుత్వం బాధితుడిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

- బీఆర్‌ఎస్ నేత నిట్టు వేణు గోపాల్ రావు



మాట్లాడుతున్న నిట్టు వేణుగోపాల్‌రావు

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలో పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని బీఆర్‌ఎస్ నేత నిట్టువేణుగోపాల్‌రావు కోరారు. ఆదివారం దేవునిపల్లి మున్నూరు కాపు సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. మున్నూరుకాపుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.